క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు





జనగామ: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పర్మార్ పింకేష్ కుమార్‌ను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ చంద్రమౌళి, మేనేజర్ రాములు, ఏఈ మహిపాల్, ఇన్‌చార్జ్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త, ఉడుగుల రమేష్ వేర్వేరుగా మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో అనారోగ్యంతో మృతి చెందిన రిటైర్డ్ పీఆర్ డీఈ కొప్పురపు కృష్ణారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు శివరాత్రి కవిత, వడ్డేపల్లి మల్లారెడ్డి, నాయకులు ఇర్రి రమణారెడ్డి, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, శివరాత్రి రాజనర్సు, రాపెల్లి జనార్దన్, నూకల నర్సిరెడ్డి, బూసరాజు రవి, కొప్పురపు విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కృపాకర్‌రెడ్డి ఉన్నారు. అలాగే లక్ష్మాపురంలో రేషన్ డీలర్ ఇమ్మడి రాజేష్‌ఖన్నా తల్లి కౌసల్య మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తాటికొండ రాజమణి(56) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందింది. కాగా, మంగళవారం ఘన్‌పూర్‌లో మృతురాలి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పరామర్శించారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆమె అంతిమయాత్రలో పాల్గొని పాడెమోశారు. అంతిమయాత్రలో బంధుమిత్రుల కోరిక మేరకు డప్పు దరువేశారు. అంతకుముందు ఎస్సీ కాలనీలో పలువురిని కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, నాయకులు మారెపల్లి ప్రసాద్, గుండె మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీని పరామర్శించిన టీపీసీసీ అధికార ప్రతినిధి



జనగామ: హైదరాబాద్ కొంపెల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ ఎంపీటీసీ చల్ల సక్కుబాయిని టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఇటీవల ఆమెకు స్టంట్ వేయగా, ఆయన వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.

లక్ష్మీనారాయణపురంలో..

పాలకుర్తి: మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన మద్దికుంట్ల చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మంగళవారం దివ్యాంగుల సంఘం సభ్యులు బాధిత కుటుంబీకులను పరామర్శించారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల సత్యనారాయణ, జిల్లా నాయకుడు దిండిగాల వెంకన్న, నియోజకవర్గ నాయకుడు షీల అంజయ్య, ప్రధాన కార్యదర్శి మంద ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు గుమ్మడిరాజుల మధు, శివరాత్రి స్వర్ణ, గాదరి శోభ, రాజు ఉన్నారు.

కేంద్రం నిర్ణయం హర్షణీయం

కొడకండ్ల: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు 50 శాతం రిజర్వేషన్ల పరిమితి వర్తించదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించడం హర్షణీయమని ఓసీ పేదల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ పుస్కూరి సోమేశ్వర్‌రావు అన్నారు. 50 శాతం రిజర్వేషన్ల కోటా ఆర్టికల్ 15(4),16(4) కింద ఇచ్చిన వాటికి మాత్రమే వర్తిస్తుందని, ఆర్టికల్ 15(6),16(6) కింది ఇచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వర్తించదని కేంద్రం పేర్కొందని, 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోటా 50 శాతం దాటిందన్న పలువురు సభ్యుల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సమాధానం సంతోషకరంగా ఉందని ఆయన అన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

● ఆర్డీఓ వానం రాముర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

స్టేషన్‌ఘన్‌పూర్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేద క్రైస్తవులకు అందించే గిఫ్ట్ ప్యాకెట్లకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వానం రామ్మూర్తి అన్నారు. క్రిస్మస్ గిఫ్ట్ ప్యాకెట్ల పంపిణీ విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన చర్చి పాస్టర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే గిఫ్ట్ ప్యాకెట్ల కోసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలన్నారు. నిరుపేదలు, దివ్యాంగులైన కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గానికి 1,000 గిఫ్ట్ ప్యాకెట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ విజయ్‌కుమార్, ఎంఆర్‌ఐ రవీందర్, పాస్టర్లు, ఫాదర్లు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి



పిల్లలను బడిలో చేర్పిస్తున్న అధికారులు

కొడకండ్ల: బడీడు పిల్లలంతా బడిలోనే ఉండాలని మండల విద్యా శాఖ నోడల్ అధికారి గ్రేస్‌కేజీయా రాణి అన్నారు. మంగళవారం మండలకేంద్ర శివారులో రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా సీఆర్‌పీ జవ్వాలి జ్ఞానానందం జీవనోపాధి నిమిత్తం ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన బ్యాగ్ ప్రిన్స్, సోన్వాని ప్రియలను గుర్తించి నోడల్ అధికారి సహకారంతో హక్యతండా ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ వరకు మండల వ్యాప్తంగా సర్వే చేపట్టనున్నట్లు, విద్యా హక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14, 15 నుంచి 19 ఏళ్ల వయస్సు బడిబయట ఉన్న పిల్లలందరిని గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రజిత, శ్రీవణ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని వినతి

జఫర్‌గఢ్: వడ్డెగూడేనికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, దివ్యాంగుడు కుక్కల ఎల్లయ్య తన కుటుంబానికి ఉద్యోగ, ఉపాధి కల్పించాలని కోరాడు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రజాదర్బార్‌లో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన తాను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 12 రోజులు ఆమరణ నిరహార దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. ఇంటి వద్ద, ఎంజీఎం ఆస్పత్రిలో ఆమరణ దీక్ష చేపట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వాల్సిందిగా కోరినట్లు తెలిపారు. ఎంతో మంది ఉద్యమకారుల పోరాటాల ఫలితంగా ఆనాడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ ఏర్పడినా ఉద్యమకారుల సంక్షేమాన్ని నాటి ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులను అదరించాలని ఆయన కోరారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న సర్పంచ్ రాజ్‌కుమార్

చిల్పూరు: సర్పంచ్‌గా గ్రామంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ, సొంత నిధులతో గ్రామాభివృద్ధి చేశానని, ఇప్పటి వరకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలని సర్పంచ్ ఉద్దమారి రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సభను నిర్వహించారు. గ్రామంలోని పలు సమస్యలపై చర్చించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మూల నాగరాజు, గనగోని నవీన్, తౌటి సునీల్, బోల్లరాజ్‌కుమార్ గ్రామ సమీపంలోని వాగు ఇసుక కేవలం ఇళ్ల నిర్మాణానికే వాడాల్సి ఉండగా సీసీ రోడ్లకు ఏవిధంగా వాడారని దీనిపై వివరణ ఇవ్వాలంటూ పట్టుబట్టారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు గనగోని రమేష్, నారగోని రాజు, మాచర్ల ప్రవీన్, ఎండీ షకీల్, రమేష్, శ్రీనివాస్‌లు అడ్డుకోగా వాగ్వావాదం చోటుచేసుకుంది. ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, కార్యదర్శి అజీజ్‌పాషా, బొమ్మిశెట్టి బాలరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి

రఘునాథపల్లి: రఘునాథపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆరుపడకల నుంచి 30 పడకల వరకు అప్‌గ్రేడ్ చేయాలని ప్రజా భవన్‌లో స్థానికుడు వినతి పత్రం అందజేశారు. జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాదర్బార్‌లో మంగళవారం మండల కేంద్రానికి చెందిన శాడ శ్రీనివాస్ ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని 45 వేల జనాభాకు అనుగుణంగా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని వినతి పత్రంలో కోరారు. తమ వినతికి ప్రజాదర్బార్‌లో అధికారులు సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రవీందర్

కొడకండ్ల: విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు, ఎంపీఐ గంట రవీందర్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి 80 మంది విద్యార్థినులకు స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, పట్టుదలతో చదివి పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. ఏటీపీ స్రవంతి పాల్గొన్నారు.

ఓటరు నమోదులో బీఎల్‌ఓలు కీలకం

రఘునాథపల్లి: ఓటరు నమోదులో బీఎల్‌ఓలు కీలకంగా ఉండాలని తహసీల్దార్ పురం యుగేందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలకు ఓటరు నమోదుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి జనవరి 5వ తేదీ వరకు అర్హులైన 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ట్రైయినర్లు అశోక్, నరేందర్‌లు ఏపీపీ వినియోగంపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో, ఆర్‌ఐలు బలరాం, శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న నీల శ్రీధర్

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ పట్టణ అధ్యక్షుడిగా డివిజన్ కేంద్రానికి చెందిన నీల శ్రీధర్ ముదిరాజ్‌ను నియమించినట్లు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర తెలిపారు. ఈమేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీధర్‌కు సింగపురం ఇందిర నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ పట్టణ అధ్యక్షుడిగా నియామకం కావడం సంతోషంగా ఉందని, పార్టీ క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నియమించిన ఇందిరతో పాటు సహకరించిన వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఘన్‌పూర్ జెడ్పీటీసీ రవి, ఎంపీటీసీ దయాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, శ్రీరాములు, ఎల్లయ్య, ఎస్.వెంకటయ్య పాల్గొన్నారు. కాగా, ఇందిరనగర్ కాలనీలోని చర్చిలో ఇందిర ప్రీ క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు.

ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు

చిల్పూరు: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని పల్లగుట్ట, పత్తేపూర్ గ్రామాల్లో మంగళవారం పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు రానున్న సర్పంచ్ ఎన్నికల్లో ఆశావహ సర్పంచ్ అభ్యర్థులతో సమావేశం, పేర్ల నమోదు కార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పదవులు వస్తాయని ఆయన అన్నారు. ఎంపీటీసీలు యాదగిరి, కుమార్, నాయకులు పాశం సురేష్, యశ్వంత్‌రెడ్డి, మల్లారెడ్డి, లవన్‌కుమార్, మల్లారెడ్డి, ఊమ్లానాయక్, భగవాన్ రెడ్డి, దార మహేందర్, కోర్నేలు, మహిళా అధ్యక్షురాలు శోభ, కృష్ణతో పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని బసిరెడ్డిపల్లి, బండనాగారం గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గ్రామ ప్రజలకు కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాచారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాత్రి కవిత, ఉప సర్పంచ్ బత్తిని రాజలింగం, పంచాయతీ కార్యదర్శులు భరత్ కిషోర్, రూపా చైతన్య, ఏఎన్‌ఎంలు ఆశాలు మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ అరితాసుదర్శన్‌గౌడ్

తరిగొప్పుల: ప్రతీ మూడు నెలలకు ఒకసారి గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మొదలైన అంశాలపై నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ జొన్నగోని అరితాసుదర్శన్‌గౌడ్ అధ్యక్షతన స్థానిక రైతు వేదిక భవనంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కాగా, ఈ సమావేశానికి మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా కేవలం వాచ్యాతండా, భోజ్యాతండా, కొత్తతండా గ్రామాల సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. మండల పరిధిలోని పలు గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడం బాధాకరమని ఎంపీటీసీ భూక్యా జుంలాల్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తండాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కరోనా మహమ్మారి మరోసారి విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ సూచించారు. పౌర సరఫరాల శాఖ, పంచాయతీ రాజ్, అర్‌అండ్‌బీ అధికారులు హాజరుకాలేదు. వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీల, కోఆప్షన్ మెంబర్ ఇరువ ఇన్నమ్మ, ఎంపీఓ మిస్బా అలాం,సర్పంచులు తిరుపతి నాయక్, బానోత్ రవి, భూక్య భూలి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ఘన్‌పూర్ తిరుమలనాథస్వామి దేవాలయం, శివునిపల్లి లక్ష్మీవేంకటేశ్వరాలయంలో ప్రతీరోజూ ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఘన్‌పూర్ తిరుమలనాథస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ ప్రధాన పూజారి కలకోట రామానుజచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోయుక్తంగా పూజలు చేపట్టారు. ధనుర్మాసం కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచే వేంకటేశ్వరస్వామి దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. కాగా, పూజలకు వచ్చిన భక్తులకు కాంగ్రెస్ నాయకులు కొలిపాక సునీత, సతీష్ ఆధ్వర్యంలో ఉచితంగా టిఫిన్ బాక్సులను అందించారు. పూజలో భక్తులు కొలిపాక సతీష్, నరేందర్, హేమలత, గోలి పద్మ, శ్రీనివాస్, స్వప్న, సురేష్, వాణి, రజిత, మంజుల, నిర్మల, సంధ్య, యాదమ్మ, రజని, కావ్య, కవిత, హరిప్రియ, లక్ష్మీ, చంద్రకళ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

'చవకబారు రాజకీయాలు సమంజసం కాదు'



మాట్లాడుతున్న నర్సింహులు

స్టేషన్‌ఘన్‌పూర్: గిరిజన మహిళా ఎంపీటీసీని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని, ఇది ఏమాత్రం సమంజసం కాదని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, ఘన్‌పూర్-1 ఎంపీటీసీ గన్ను నర్సింహులు అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన తోటి ఎంపీటీసీలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న ఆదివారం ఇంట్లో ఉప్పలమ్మ పండుగ చేసుకోగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు తోటి ఎంపీటీసీలను, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించానన్నారు. ఫంక్షన్లకు ఇతర ఎంపీటీసీల మాదిరిగానే తానేదార్‌పల్లి ఎంపీటీసీ మాలోత్ లలితశ్రీ వచ్చి ఉప్పలమ్మ దేవత గుడి వద్ద కొబ్బరికాయ కొట్టారన్నారు. అయితే ఫంక్షన్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి తమ కుటుంబ సభ్యులను, ఎంపీటీసీలను పరిచయం చేశాక ఫొటో దిగే క్రమంలో ఎంపీటీసీ లలిత ఫొటో దిగేందుకు వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఏకగ్రీవ ఎంపీటీసీగా అయి ఎన్నికల ముందు కాంగ్రెస్‌లోకి వెళ్లావు, మాతో కలిసి ఫొటో దిగడం ఎందుకమ్మా అని మర్యాదగా కడియం చెప్పారన్నారు. ఈ అంశాన్ని ఆమె భర్త మాలోత్ శ్రీను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చిలువలు పలువలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కడియం వెళ్లాక ఎంపీటీసీ లలిత ఫంక్షన్‌లో భోజనం చేసిందని, అమాయక గిరిజన మహిళా ఎంపీటీసీని అడ్డుపెట్టుకుని చవకబారు రాజకీయాలు చేయడం తగదన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు పురమాని రజాక్‌యాదవ్, బూర్ల లతాశంకర్, గుర్రం రాజు, మునిగెల రాజు, పార్టీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్

బచ్చన్నపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని, వారికి ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తారని టీపీసీసీ కిసాన్ సెల్ కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28వ తేదీ నుంచి అన్ని గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇదివరకే ఉన్న రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, తప్పులను సరి చేయడం వంటి అవకాశం కూడా ఉందన్నారు. కార్యక్రమంలో బీజీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ చెరుకూరి శ్రీనివాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు



మట్టిని తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న మైనింగ్ అధికారులు

చిల్పూరు: అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని మైనింగ్ సర్వేయర్ శ్రీధర్, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి హెచ్చరించారు. నష్కల్, వంగాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 143 సర్వేనంబర్ భూముల్లో ఇటీవల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని బీజేపీ బీసీ సెల్ నాయకుడు గంటె ఉపేందర్‌యాదవ్ మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్‌తో కలిసి వారు ఆకస్మికంగా మట్టి తవ్వకాలు చేపట్టే ప్రాంతాలను సందర్శించారు. అదే సమయంలో పొక్లెయినర్లతో మట్టిని తవ్వి టిప్పర్లలో నింపుతుండగా అడ్డుకుని వాహనాలు, ఓనర్లపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మూడు ప్రాంతాల్లో మట్టి దందా ఎక్కువగా ఉందని తాము వచ్చే సరికే వాహనాలను వదిలి పారిపోయారని వాటి నంబర్ల ఆధారంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సన్మానం

దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలకు మంగళవారం నల్లకుంట కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన గిరిజన నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపులో గిరిజనులు క్రియాశీలకంగా పాటుపడినందుకు కృతజ్ఞతలు చెప్పారు. నాయకులు శ్రీనివాస్, మంగ్యానాయక్, బానోత్ వెంకన్న, భాస్కర్, బాబు, శ్రీకాంత్, బానోత్ రవి, అరుణ్, సుమన్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.

గోవిందరావుకు నివాళి

చిల్పూరు: సురభి నాటక మండలి వ్యవస్థాపకుడు వనారస గోవిందరావు వర్ధంతిని మంగళవారం మండలంలోని పల్లగుట్టలో భానోదయ నాట్యమండలి ఆధ్వర్యంలో సురభి నాటక థియేటర్‌లో నిర్వహించారు. సురభినాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మొక్కలు నాటారు. నిర్వాహకుడు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన జగిత్యాల సాంబరాజు సోమవారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు మోకు జారి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గనగోని రమేష్ అందించిన వివరాలు.. రోజు మాదిరిగా సోమవారం సాయంత్రం కల్లు గీసేందుకు సాంబరాజు తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. రాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో భార్య మౌనిక విషయాన్ని తెలుపగా తాటివనానికి వెళ్లగా గాయాలతో కనిపించాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గీత వృత్తే ఆధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్న బాధితకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రమేష్ కోరారు.

ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడిగా నర్సింహులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండల ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా స్టేషన్‌ఘన్‌పూర్-1 ఎంపీటీసీ గన్ను నర్సింహులుగుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలకుగాను 11 మంది బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీటీసీలు, ముగ్గురు కాంగ్రెస్, ఒక్కరు సీపీఎం పార్టీ నుంచి ఉన్నారు. అయితే గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్-3 ఎంపీటీసీ సింగపురం దయాకర్ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దాంతో మంగళవారం ఎంపీటీసీల ఫోరం మండల నూతన కమిటీని ఎన్నుకోగా గన్ను నర్సింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎంపీటీసీల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బూర్ల లతాశంకర్, పురమాని రజాక్‌యాదవ్, మునిగెల రాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని ఇటుకాలపల్లికి చెందిన జేరిపోతుల భిక్షపతి మృతి చెందాడు. కాగా అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షులు, ఎంపీటీసీ దూడల కనుకయ్యగౌడ్ మంగళవారం అందజేశారు.

తిమ్మాపూర్‌లో..

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పులి అనారోగ్యం ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ బాధిత కుటుంబానికి రూ. 5 వేల ఆర్థికసాయం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ జ్యోతి నాగరాజు, ఎర్ర నరేష్, ఎంపీటీసీ సభ్యురాలు ఇల్లందుల స్రవంతి మొగిళి, గాదరి బాబు, సతీష్, నక్క మల్లేష్ ఉన్నారు.

పత్తి మిల్లులో షార్ట్‌సర్క్యూట్

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని హరిహర కాటన్ జిన్నింగ్ మిల్లులో మంగళవారం షార్ట్ సర్క్యూట్ సంభవించింది. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ ఆస్తి నష్టం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం జిన్నింగ్ యంత్రాలు నడుస్తుండగా షార్ట్ సర్క్యూట్ జరిగింది. నిప్పు రవ్వలు, పొగ రావడాన్ని గుర్తించిన సిబ్బంది వెంటనే ఫైర్ పైపులతో మంటలు వ్యాప్తి చెందకుండా నిలువరించారు. ఫైర్ సిబ్బంది చేరుకునే సరికి సిబ్బంది పొగ, మంటలు రాకుండా పూర్తిగా చల్లార్చారు.

ఎలక్ట్రానిక్ షాపు దగ్ధం

పాలకుర్తి: మండలం కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని నందిని ఎలక్ట్రానిక్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి... ముత్తారం గ్రామానికి వర్ధమాను లక్ష్మణ్‌కు చెందిన షాపు మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి అందులో ఉన్న సామగ్రి దగ్ధమైంది. అది గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

సమస్యలపై తాత్కాలిక సర్పంచ్‌కు దరఖాస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల శివునిపల్లి తాత్కాలిక సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన బూర్ల విష్ణుకు గ్రామంలోని వివిధ వార్డులకు చెందిన ప్రజలు పలు సమస్యలపై దరఖాస్తులు మంగళవారం అందజేశారు. దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన సమస్యల్ని పరిష్కరించేలా శాయశక్తులా కృషి చేస్తానని ఆయన తెలిపారు.